సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 18 । మే । 2025



వైభవం.. రథోత్సవం

జమ్మలమడుగులోని నారాపురస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. -8లో



రోడ్డు ప్రమాదంలో అవ్వ, మనవడు దుర్మరణం

సింగరాయపల్లె గ్రామానికి చెందిన యంబడి సౌరమ్మ (45), తలారి జశ్వంత్ (15) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. -8లో

గరిష్టం/కనిష్టం
38.2/27.1

వాతావరణం

జిల్లాలో శనివారం 27.1 – 38.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ముగిసిన ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈ నెల 12 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారంతో ప్రశాంతగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆర్ఐఓ బండి వెంకట సుబయ్య మాట్లాడుతూ మే 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం కడప నగరంలోని బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రారంభమవుతుందని తెలిపారు.

31న చలో సంగమేశ్వరం



చలో సంగమేశ్వరం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జగదీష్ తదితరులు

కడప రూరల్: రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 31న సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవ సంగమేశ్వర సభను జయప్రదం చేయాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ పిలుపునిచ్చారు. రాయలసీమ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్ లో సంగమేశ్వర సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అంటే అమరావతి, పోలవరం కాదన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలను అమలు చేయడంతో పాటు రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, త్రాగునీరును అందించాలన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ జీవితకాలం పెంచడానికి సిద్దేశ్వరం అలుగునిర్మాణం ను చేపట్టాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సత్తార్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, శివారెడ్డి, సి ఆర్ వి ప్రసాద్, రాము, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రుల రాక

కడప సెవెన్‌రోడ్స్: మహానాడు ఏర్పాట్ల పరిశీలన కోసం ఆదివారం పలువురు మంత్రులు కడప నగర పర్యటనకు వస్తున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మధ్యాహ్నం 2.30 గంటలకు కడపకు చేరుకుంటారు. మహానాడు జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తారు. సాయంత్రం బనగానపల్లెకు చేరుకుంటారు.

- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మధ్యాహ్నం 12.30 గంటలకు కడపకు చేరుకుని ఇక్కడి కార్యక్రమాల్లో పాల్గొని రాత్రి 9.00 గంటలకు బయలుదేరి వెళ్లనున్నారు.
- కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ మధ్యాహ్నం 12.35 గంటలకు కడప ఎయిర్ పోర్టుకు చేరుకుని అనంతరం స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.
- రెండు రోజుల పర్యటన నిమిత్తం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత జిల్లాకు రానున్నారు. మంత్రి పెనుకొండ నుంచి బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు కడపకు చేరుకోనున్నారు. అనంతరం ఆమె నగర శివార్లలో జరిగే టీడీపీ మహానాడు ప్రాంగణాన్ని పరిశీలించి మహానాడు నిర్వహణ సన్నాహక సమావేశంలో పాల్గొంటారు. రెండోరోజు సోమవారం ఆర్ట్స్ కాలేజీ సమీపంలో నిర్మించనున్న స్టార్టప్ హబ్ భవన సముదాయ నిర్మాణా శంకుస్థాపనలో పాల్గొననున్నారు.

నిధుల దోపిడీకి టెండర్

- టెండర్ పూర్తి కాకుండానే పనులు చేసిన వైనం
- కాంట్రాక్టర్లు పోటీకి రాకుండా ముందు జాగ్రత్త
- రికార్డు లేకుండా జంగిల్ క్లియరెన్స్ చేసిన ఎమ్మెల్యే వర్గీయులు
- లక్షలతో చేపట్టాల్సిన పనులను కోట్లల్లో టెండర్లు



బుగ్గవంక

సాక్షి ప్రతినిధి, కడప: కడపలో కూటమి నేతల తీరు ఇష్టారాజ్యంగా మారింది. నిబంధనలకు నీళ్లొదిలి నిధుల భోజ్యం పక్కాగా సాగుతోంది. టెండర్లు వేయకుండానే పనులు చేసిన వైనం ఒక్క టీడీపీ ప్రభుత్వంలోనే సాధ్యమవుతోంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కడపలో టెండర్లు పూర్తి కాకుండానే పనులు మాత్రం పూర్తవుతున్నాయి. అవును.. బుగ్గవంక వాగులో జంగిల్ క్లియరెన్స్ పేరుతో టీడీపీ నేతలు సాగించిన పనులే ఇందుకు సాక్ష్యం. మహానాడు ఖర్చుల కోసమే కోట్ల రూపాయల నిధులకు 'టెండర్' వేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

- కడప నగరాన్ని బుగ్గవంక రెండుగా విభజించింది. భారీ వర్షాలు కురిస్తే తప్పా బుగ్గవంక పారిన చరిత్ర లేదు. అయినా ఆ నీరు కూడా పక్కనున్న కాలనీలపై పడకుండా నగరం మొత్తం మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే ప్రొటెక్షన్ వాల్ నిర్మాణమైంది. అంతేకాదు రాకపోకలకు ఇబ్బంది లేకుండా హైలెవల్ బ్రిడ్జిలు కూడా నిర్మించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా మరో రెండు బ్రిడ్జిలు మంజూరు చేశారు. ఆ వంక వల్ల ప్రజలకు ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేదు. కాగా కూటమి ప్రభుత్వం రావడంతోనే బుగ్గవంకలో జంగిల్ క్లియరెన్స్ పేరుతో రూ.3.60 కోట్ల పనులను మంజూరు చేయించుకున్నారు. వాస్తవానికి అక్కడ పెద్దగా జంగిల్ లేదు. క్లియరెన్స్ చేయాల్సిన అత్యవసర పరిస్థితులు, అవసరం అంతకన్నా లేదు. మహానాడు ఖర్చుల కోసమే ప్రభుత్వం ఈ పనులను మంజూరు చేసిందని విశ్లేషకుల మాట.



టెండర్లు పూర్తి కాకుండానే పనులు చేసేశారు

బుగ్గవంక జంగిల్ క్లియరెన్సు పనులు 9ప్యాకేజీలుగా చేసేందుకు టెండర్లు పిలిచారు. ఆ టెండర్లు పూర్తి కాకుండానే తెలుగుతమ్ముళ్లు పని పూర్తి చేయడం గమనార్హం. అదేమని అడిగే వారు లేకపోవడం, ఎలాగూ తాము చెప్పిన వారికే కాంట్రాక్టు వస్తుందనే ధీమాతో టీడీపీ నేతలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే మాధవిరెడ్డి కనుసన్నల్లో పనులు చకచకా సాగుతున్నాయి. 9 ప్యాకేజీలుగా విభజించి ఒక్కొక్కటిగా టెండర్లు పిలుస్తున్నారు. దీనిలో తాము చెప్పిన వ్యక్తులు కాకుండా వేరే వ్యక్తులు టెండర్ వేస్తే బెదిరించి పంపుతున్నారు. నాలుగైదు టెండర్లు మాత్రమే ఇప్పటికి పూర్తయ్యాయి. అధికారులు టెండర్ల విషయంలో సహకరిస్తుండటంతో ఇక వారి ఇష్టారాజ్యం అయ్యింది. ఎంత అక్రమాలకు పాల్పడినా టెండర్లు ప్రక్రియ పూర్తయి, వర్క్ ఆర్డర్ ఇచ్చిన తర్వాత ఎవరి పేరుపైనైతే టెండర్ వస్తుందో వారే పనిచేయాల్సి ఉంది. కానీ ఇక్కడ పూర్తి కాని టెండర్లకు ఎవరు పనిచేస్తున్నారనేది చర్చనీయాంశంగా మారింది.

అధికారుల సహకారంతో దోపిడీ

కడప ఆర్కే జూనియర్ కాలేజి బ్రిడ్జి నుంచి కింది వైపునకు రూ.33.42 లక్షలతో పనులు చేయాల్సి ఉంది. ఈ పనులకు టెండర్లు దాఖలు చేయడానికి చివరి తేదీ మే 21. కాగా అక్కడ పనులు కూడా పూర్తి అయ్యాయి. ఎక్కడా చోటుచేసుకొని అక్రమాలకు కడపలో టీడీపీ నేతలు తెరలేపారు. ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న మహానాడు ఖర్చులకు స్థానిక నేతలకు డబ్బు కావాలి కాబట్టి, అవసరం లేకపోయినా పనులు మంజూరు చేయించారని పలువురు వివరిస్తున్నారు. అంతే కాదు, లక్షలల్లో చేయగల్గిన ఆ పనులకు కోట్లల్లో ప్రతిపాదనలు పెట్టించారు. ఆపై స్థానిక నేతలు టెండర్లు కూడా కాకుండానే పనులు చేసేస్తున్నారు. ఈమొత్తం వ్యవహారంలో అధికారుల సహకారం వల్లే దోపిడీకి ఆస్కారం ఏర్పడిందని విశ్లేషకులు ఆరోపిస్తుండడం విశేషం.

మనోజా.. మజాకా!

- ప్రజాధనంతో మహానాడుకు సొగసులు
- టీడీపీ సేవలో కమిషనర్ మనోజ్ రెడ్డి



కమిషనర్ మనోజ్ రెడ్డి



కడప కార్పొరేషన్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, కడప: కడప కార్పొరేషన్ అధికారులు తెలుగుదేశం పార్టీ సేవలో మునిగితేలుతున్నారు. ముఖ్యంగా కమిషనర్ మనోజ్ రెడ్డి పూర్తి టీడీపీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. నగరంలో పలు చోట్ల సరైన రోడ్లు లేవు.. డ్రైనేజీ కాలువల్లేవు.. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా అధికార పార్టీ సేవలో నిమగ్నమయ్యారు. ఈ నెల 27న ప్రారంభమయ్యే మహానాడు కోసం ఏకంగా కార్పొరేషన్ నిధులనే ఖర్చు చేస్తున్నారు. మహానాడుకు నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలంటూ సుందరీకరణ పేరుతో లక్షల రూపాయల కార్పొరేషన్ నిధులను ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారు. ఓ వైపు ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి కూడా ఇబ్బంది పడుతూ, ఇదివరకే చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోయినా టీడీపీ సేవలో తరించడం విమర్శలకు దారితీస్తోంది.

- 'నిబంధనలు ఎలా ఉన్నా మా ఎమ్మెల్యే చెప్పారు.. అంతే' అంటున్నారు కార్పొరేషన్ అధికారులు. ఓ రాజకీయ పార్టీ సమావేశానికి కార్పొరేషన్ నిధులు ఖర్చు చేయడం ఏంటనే ప్రశ్న ఇప్పుడు కడప వాసుల నుంచి వినిపిస్తోంది. సుమారు 25 లక్షల రూపాయల నిధులను చంద్రబాబు మహానాడుకు వెళ్లే మార్గంలో మొక్కలు నాటడానికి, సర్కిళ్లలో పెయింటింగ్స్ వేయించి తీర్చిదిద్దడానికి ప్రతిపాదనలు పెట్టారు. రాజకీయ పార్టీ సమావేశానికి సీఎం చంద్రబాబు వస్తుంటే ప్రజాధనం ఖర్చు చేయడం ఏంటని నగరవాసులు నిలదీస్తున్నారు.

పాలకవర్గం నో చెప్పినా...

సీఎం చంద్రబాబు వెళ్లే దారిలో ఆయన కంటికి ఇంపుగా కనిపించాలని లక్షలాది రూపాయలు నిధులు వెచ్చించేందుకు సిద్ధమయ్యారు. ఇదే అంశాన్ని స్టాండింగ్ కౌన్సిల్ దృష్టికి తీసుకురాగా, ఓ పార్టీ కార్యక్రమానికి తామెలా నిధులిస్తామని ప్రశ్నించింది. దీంతో తనకున్న అధికారాలతో కమిషనర్ మనోజ్ రెడ్డి ప్రభుత్వ పెద్దలు, స్థానిక టీడీపీ నేతల మెప్పు కోసం పనులను విభజించి మంజూరు చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధమని, కార్పొరేషన్లో అసలే నిధులు లేక అల్లాడుతుంటే ఇలా చేయడం సరికాదని పాలకవర్గం వాపోతున్నా అస్సలు వినడం లేదు. మరో వైపు ఉద్యోగులకు క్రమం తప్పకుండా జీతాలు ఇవ్వడం లేదు. ఇప్పటికే జనరల్ ఫండ్ ద్వారా రూ.54కోట్లు పనులకు బిల్లులు చెల్లించలేదని పలువురు వాపోతున్నారు. ఇలా ఖర్చు చేయడం సరికాదని పలు రాజకీయ పక్షాలు విమర్శిస్తున్నాయి. ఎవరెన్ని విమర్శలు చేసినా.. స్వామి భక్తి ముందు ఇవేమీ పనికి రావని కడప కమిషనర్ తేల్చేశారు. నిధుల మంజూరులో తనకున్న విచక్షణను వినియోగించి మహానాడు సేవలో తరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

పరిసరాల శుభ్రతతో స్వచ్ఛ ఆంధ్ర




మాట్లాడుతున్న కలెక్ట్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

వల్లూరు (చెన్నూరు): ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాల శుభ్రత పాటించినపుడే స్వచ్ఛ ఆంధ్ర సాధ్యమవుతుందని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. చెన్నూరు గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన స్వర్ణ ఆంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లలోని వ్యర్థ పదార్థాలు .. చెత్తా చెదారాన్ని రోడ్లపై వేయకూడదన్నారు వాటిని తడి పొడి చెత్తలుగా వేర్వేరుగా హరిత రాయబార్లకు అందించాలన్నారు. అలాగే నీటిని వృథా చేయకూడదని సూచించారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని, అందుకయ్యే ఖర్చుకు సంబంధించి నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ప్రతినెల మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. అలాగే ఎండ వేడిని తట్టుకునేందుకు టోపీలు ధరించాలని, ఎక్కువ శాతం తాగునీరు తీసుకోవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు అనంతరం కలెక్టర్ గ్రామపంచాయతీ ఆవరణంలో మొక్కలు నాటి నీరు పోశారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర నినాదంతో గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండ్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. జేసీ అదితీసింగ్, డీపీఓ రాజ్యలక్ష్మి, డీఎంహెచ్వో డాక్టర్ నాగరాజు, ఆర్డీవో జాన్ ఇర్విన్, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, జెడ్పీ సీఈవో ఓబులమ్మ, ఎంపీపీ సురేష్, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ఏడుకొండలు, తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ కిరణ్ మోహన్‌రావు, ఏపీఓ శైలజ, ఏపీఎం వెంకటేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి హనుమజ్జయంతి వేడుకలు



గండి వీరాంజనేయ స్వామి మూలవిరాట్

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు హనుమజ్జయంతి వేడుకలు జరుగనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజ గోపాలాచార్యులు ఆధ్వర్యంలో టీటీడీ వేదపాఠశాలకు చెందిన రామానుజా చార్యులు బృందం వారు ఈవేడుకలను ఘనంగా నిర్వహిస్తారని చెప్పారు. సోమవారం సాయంత్రం 6గంటలకు అంకురార్పణతో మొదలు పెట్టి 22వతేది గురువారం త్రికాళ ఆరాధన,పంచసూక్త హోమం, మన్యుసూక్త హోమం, ఆంజనేయ స్వామి మూల మంత్ర హోమం,సుదర్శన హోమం, మహాపూర్ణాహుతి, సోమ కుంభ ఉద్వాసన, సోమ కుంభ ప్రోక్షన, మహాస్వప్న తిరుమంజనం, గోష్ఠి తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలతో హనుమజ్జయంతి వేడుకలు ముగుస్తాయని తెలిపారు. ఈ వేడుకల సందర్భంగా అన్న ప్రసాద వితరణ, పూల అలంకరణలకు దాతలు ముందుకు వచ్చి సహకరిస్తున్నారని పేర్కొన్నారు. హనుమజ్జయంతి వేడుకల్లో భక్తులు విరివిగా పాల్గొనాలని వారు కోరారు.

హుండీ ఆదాయం లెక్కింపు

రాజుపాళెం: మండలంలోని వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లో శనివారం హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ జి.మల్లికార్జున ప్రసాద్ ,ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. నాలుగు నెలల తొమ్మిది రోజుల గాను రూ.5,42,314 వచ్చిందని వెల్లడించారు. సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, అర్చకులు, భక్తులు, సేవకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన విజయవంతం చేయాలి: కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను ప్రొటోకాల్ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టి విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఎస్పీ అశోక్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడులతో కలిసి జిల్లాలో ముఖ్యమంత్రి పాల్గొనే సీకే దిన్నె మండల పరిధిలోని పబ్బాపురం సమీపంలో ఏర్పాటు చేసే బహిరంగ సభా స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనలో భాగంగా విధులు కేటాయించిన అధికారులందరూ ప్రోటోకాల్ నిబంధనలను పక్కాగా పాటించాలన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభా ప్రాంగణం, పరిసరాలలో పారిశుద్ధ్య పనులు పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి ముందు అప్పటికే అక్కడ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డిలు కలెక్టర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, డీపీఓ రాజ్యలక్ష్మి, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, పోలీసు, ఫైర్ ఆఫీసర్ ధర్మారావు, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఇన్‌చార్జిల పాలన?

ఓ శాఖ అధికారి ఉద్యోగ విరమణ చెందినా, బదిలీ అయినా ఆ స్థానాన్ని పదిరోజులు లేదంటే నెలరోజుల్లో భర్తీ చేయడం పరిపాటి. కానీ ఆర్టీసీలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. కీలక స్థానాల్లో నెలల తరబడి ఇన్‌చార్జి పాలన కొనసాగుతోంది. పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో పాలనలో జవాబుదారీతనం కొరవడుతోంది.

- కీలక పోస్టుల్లో అధికారి లేకపోవడంతో కొరవడిన జవాబుదారీతనం
- పాలనా పరంగా తప్పని ఇబ్బందులు



కడపలోని ఆర్టీసీ అధికారుల కార్యాలయాల కాంప్లెక్స్

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో నాలుగు జోన్లు ఉన్నాయి. వీటిలో విజయనగరం, విజయవాడ, నెల్లూరు, కడప ఉన్నాయి. ఇందులో కడప జోన్ అతి పెద్దది కావడం విశేషం. ఈ జోన్‌లో 52 డిపోలు ఉన్నాయి. అలాంటి ముఖ్యమైన కడప జోన్‌లో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇన్‌చార్జి పాలన కొనసాగుతుండడం గమనార్హం. గుత్తి, గుంతకల్లులకు ఒక్క డిపో మేనేజరే కొనసాగుతున్నారు. ఉరవకొండ, తాడిపత్రిలకు కూడా ఇన్‌చార్జి డీఎంలే కొనసాగుతున్నారు. అన్నమయ్య జిల్లాలో పీలేరు, కర్నూలు జిల్లాలో ఆదోని, పత్తికొండకు ఒక డీఎం, కర్నూలు–2, ఎమ్మిగనూరుకు ఇన్‌చార్జి డీఎంలు విధులు నిర్వర్తిస్తున్నారు. నంద్యాల రీజియన్‌లో ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు డిపోలలో ఇన్‌చార్జి డీఎంలు పనిచేస్తున్నారు. నంద్యాలలో పనిచేస్తున్న డీఎం డిప్యూటీ సీఎంఈగా విజయవాడకు బదిలీ కావడంతో అక్కడా ఇన్‌చార్జి పాలన కొనసాగుతోంది. సత్యసాయి జిల్లా మడకశిర, పెనుగొండ డిపోలకు ఒకే డీఎం పనిచేస్తున్నారు. తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తిలో ఇన్‌ఛార్జి పాలనే కొనసాగుతోంది. కర్నూలు, తిరుపతి పర్సనల్ ఆఫీసర్(పీఓ)లుగా ఏటీఎం కమర్షియల్ కూడా ఇన్‌చార్జిలే పనిచేస్తున్నారు. కర్నూలులో డిప్యూటీ సీటీఎం, తిరుపతిలో డిప్యూటీ సీటీఎం, తిరుపతిలో డిప్యూటీ సీఎంఈలు కూడా ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. కడప జోనల్ వర్క్‌షాప్‌లో వర్క్స్ మేనేజర్‌గా ఇన్‌చార్జిలే వ్యవహరిస్తున్నారు. అలాగే వర్క్‌షాప్‌లో కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్‌లో పనిచేస్తున్న అధికారి ఉద్యోగ విరమణ చేయడంతో అక్కడా కూడా ఇన్‌చార్జి అధికారే విధులు నిర్వర్తిస్తున్నారు. కడపలో డిప్యూటీ సీటీఎంగా పనిచేస్తున్న లక్ష్మీభాస్కర్ గత నెల 30వ తేది ఉద్యోగ విరమణ చేయడంతో ఆ పోస్టులో కడప డీఎంకు ఇన్‌చార్జి అధికారి పనిచేస్తున్నారు. చిత్తూరులో డిప్యూటీ సీఎంఈ పోస్టు ఖాళీగా ఉండడంతో అక్కడి ఆర్ఎంకు ఇన్‌చార్జిగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఇన్‌చార్జి పాలనతో ఇబ్బందులు

కడపజోన్ పరిధిలో వివిధ పోస్టులు ఖాళీగా ఉండడంతో పరిపాలన పరంగా ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కొంతమంది అధికారులు ఉద్యోగ విరమణ చేయగా, మరికొందరిని ఆర్టీసీ ఉన్నతాధికారులు బదిలీ చేశారు. దీంతో ఆయా అధికారుల స్థానంలో సమీప ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని ఇన్‌చార్జిలుగా నియమించడంతో రెండు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు ఖాళీగా ఉన్న పోస్టులపై దృష్టి సారించి భర్తీ చేయాలని పలువురు అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో అవ్వ, మనవడు దుర్మరణం




మృతిచెందిన సొరమ్మ, జశ్వంత్

కలసపాడు : మండలంలోని సింగరాయపల్లె గ్రామానికి చెందిన యంబడి సొరమ్మ (45), తలారి జశ్వంత్ (15) కలసపాడు సమీపంలోని ఐటీఐ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సొరమ్మ, ఆమె మనుమడు జశ్వంత్ సింగరాయపల్లెలో మూడు రోజులు జరిగే తిరునాలకు సరుకులు తీసుకువచ్చేందుకు కలసపాడుకు వెళ్లారు. సరుకులు తీసుకుని స్వగ్రామానికి వస్తుండగా కలసపాడు సమీపంలోని ఐటీఐ వద్ద చెన్నుపల్లె నుంచి గొర్రెల లోడుతో వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. సొరమ్మ అక్కడికక్కడే మృతిచెందగా జశ్వంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జశ్వంత్‌ను కలసపాడులోని ఓ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతదేహాలను పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక వైఎస్సార్ సర్కిల్ సమీపంలోని వెంకటేశ్వర వైన్స్ ముందు శనివారం సాయంత్రం గుర్తు తెలియని వృద్ధుడు(70) మృతి చెందాడు. ఇతను గత కొంత కాలంగా ఈ ప్రాంతంలో యాచన చేస్తూ తిరుగుతుండేవాడు. మద్యం కోసం వైన్ షాపు వద్దకు వెళ్లి మద్యం తీసుకొని వర్షం వస్తుండడంతో అక్కడే నిలబడ్డాడు. ఉన్నట్లుండి కుప్పకూలి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాల నియంత్రణలో కొరవడిన నిఘా

- రోజురోజుకు పెరుగుతున్న వివిధ రకాల నేరాలు
- చోరీలలో ఫిర్యాదుదారులచేత తక్కువగా పోగొట్టుకున్నట్లు కేసుల నమోదు
- జిల్లాలో సీసీ కెమెరాల పనితీరులో లోపం
- పోలీసు కో–ఆపరేటివ్ సొసైటీలో గోల్‌మాల్‌పై చర్యలు నిల్
- పోలీసుశాఖలో కొందరు అధికారులు, సిబ్బంది పనితీరు అవినీతిమయం
- సైబర్ నేరాలలో కోట్లాది రూపాయలను పోగొట్టుకుంటున్న బాధితులు
- నేడు కడపలో పర్యటించనున్న రాష్ట్ర హోంశాఖామంత్రి వంగలపూడి అనిత



కడప అర్బన్ : వైఎస్‌ఆర్ కడప జిల్లాలో రోజురోజుకు నేరాలు పెరిగిపోతున్నాయి. వాటిని కట్టడి చేసేందుకు జిల్లా ఎస్పీతో పాటు, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. కానీ దొంగతనాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొందరు పోలీసు అధికారుల అవినీతి చర్యలతో నేరాల నియంత్రణపై నిఘా కొరవడిందని చెప్పవచ్చు. పోలీసుశాఖ ఉన్నతాధికారులు మాత్రం 'ఫ్రెండ్లీ పోలీస్'గా ఉండాలని విధించిన నిబంధనలు పోలీసు అధికారుల కాళ్లకు బంధనాలు వేసినట్లుగా భావించాల్సి వస్తోంది. దీనికి తోడు జిల్లా పోలీసు శాఖలో పోలీసు అధికారులు, సిబ్బంది కొరత వేధిస్తోంది.

- కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 15వ తేదీన రాత్రి సమయంలో బిల్టప్ వద్ద పులివెందుల రహదారిలో వున్న వైన్‌షాపు ముందు రాయప్ప అనే వ్యక్తి సాదిక్‌వలీ అనే వ్యక్తిని కత్తితో దారుణంగా గొంతుకోసి హత్య చేశాడు. అలాగే ఈనెల 11వ తేదీన రాత్రి సమయంలో వరుణ్‌తేజ్ అనే యువకుడిని ఆంజనేయులు, అతని కుమారుడు జ్ఞానేశ్వర్‌లు కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డారు. కడప– పులివెందుల రహదారిలో బిల్టప్ వద్ద ఓ బార్, రెండు వైన్‌షాపులు, అనధికారిక పర్మిట్‌రూమ్‌లు ఉన్నాయి. బిల్టప్ సర్కిల్ ఇలాంటి నేరాలకు అడ్డాగా మారి సమస్యాత్మక ప్రదేశంగా తయారైంది.
- కడప నగరంతో పాటు జిల్లాలోని ప్రొద్దుటూరు, ఇతర ప్రాంతాలలో ఇళ్లలో దొంగతనాలు ఇటీవలి కాలంలో జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులను నమోదు చేయకుండా వారికి నచ్చినట్లు, ఇష్టం వచ్చినట్లు వారికి ఇబ్బంది రాకుండా ఉండేలా తక్కువ మొత్తంలో బంగారు ఆభరణాలు, డబ్బులు పోయినట్లుగా ఫిర్యాదులను స్వీకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.
- గత ఏడాదిలో కడప నగరంతో పాటు, ఒంటిమిట్ట ప్రాంతాలలో జరిగిన ఎస్‌బీఐ ఏటీఎం మిషన్‌ల చోరీ కేసును ఇప్పటివరకు పోలీసులు నిగ్గు తేల్చలేకపోయారు.
- జిల్లాలో సైబర్ నేరాల బారినపడి తమ బ్యాంకు ఖాతాలలోని లక్షలాది రూపాయలను పోగొట్టుకుని బాధితులు కడపలోని సైబర్ నేరాల నియంత్రణ పోలీసు విభాగానికి క్యూ కడుతున్నారు. ఇప్పటికే దాదాపు 8 నుంచి 10 కోట్ల రూపాయలను ఏడాది కాలంలోనే పోగొట్టుకున్న బాధితులకు సాంకేతిక, ప్రాక్టికల్ సమస్యలతో రికవరీ చేయలేకపోతున్నారు.
- జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ వాహనదారులను ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని తనిఖీలు, అవగాహన కల్పిస్తున్నప్పటికీ రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వాహనదారుల మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలను నిర్లక్ష్యంగా నడపడంలాంటి చర్యలతో ప్రమాదాలను నిలువరించలేకపోతున్నారు.
- పోలీసుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన 'పోలీస్ కో–ఆపరేటివ్ మ్యూచువల్ సొసైటీ'లో సభ్యుల డబ్బులను గోల్‌మాల్ చేసి రూ.కోటి 20 లక్షల మేరకు అవినీతికి పాల్పడిన ఉద్యోగిపై విచారణ అటకెక్కిందనే విమర్శలు వస్తున్నాయి. సభ్యులు తమ సభ్యత్వం డబ్బులను ఎప్పుడు పోలీసు ఉన్నతాధికారులు ఇప్పిస్తారా? అని ఎదురు చూస్తున్నారు.
- నేరాల నియంత్రణకు కడప నగరంలో 250, ప్రొద్దుటూరు పట్టణంలో 220 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. పోలీసు అధికారుల ప్రయత్నాలకు కూటమి ప్రభుత్వం సహకరిస్తేనే సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.
- జిల్లా పోలీసు శాఖలోని ఏఆర్ విభాగంలో కానిస్టేబుళ్లగా పనిచేస్తున్న సిద్దారెడ్డిని అవినీతి ఆరోపణలపై, యువతి ఆత్మహత్యకు కారణమైన రామ్మోహన్‌రెడ్డిని జిల్లా ఎస్పీ సస్పెండ్ చేశారు. ఇలాంటి సంఘటనలపై పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా వుంచి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.
- ప్రతి సోమవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితులు చేసే ఫిర్యాదులలో ఎక్కువగా భూములు, స్థలాల ఆక్రమణలు, డబ్బుల బాకీ వ్యవహారాలే వస్తున్నాయి. ఇటీవల జిల్లాలో షేర్ మార్కెట్, క్విడ్‌ప్రోకో పేరుతో కడప నగరానికి చెందిన ఓ వ్యక్తి దాదాపుగా 12 నుంచి 20 కోట్ల రూపాయలు కాజేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు.

నేడు జిల్లాకు హోంమంత్రి రాక ...

టీడీపీ మహానాడు కార్యక్రమం కడప నగర శివార్లలోని పబ్బాపురం వద్ద ఈనెల 27, 28, 29 తేదీలలో నిర్వహించనున్న నేపథ్యంలో ఇప్పటికే పలువురు మంత్రులు విచ్చేసి పరిశీలించి వెళ్లారు. ఈక్రమంలోనే రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత ఆదివారం కడపకు విచ్చేసి మహానాడు ప్రాంగణాన్ని అధికారులతో కలసి పరిశీలించనున్నారు. జిల్లాలో నేరాల నియంత్రణకు సంబంధించి ఆమె పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేస్తారేమోననే ఆశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పశువులు మేపుకునేందుకు వెళ్లి..

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



సుబ్బరమణయ్య(ఫైల్)

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో శనివారం సాయంత్రం పిడుగు పడి బాలాయపల్లె సుబ్బ రమణయ్య(40) అనే వ్యక్తి మృతి చెందాడు. గ్రామంలోని దళితవాడకు చెందిన బాలాయపల్లె సుబ్బ రమణయ్య అలియాస్ సుబ్రమణ్యం శనివారం సాయంత్రం గేదెలు మేపుకునేందుకు గ్రామ సమీపంలోని స్మశానవాటిక దగ్గర ఉండే పొలాల్లోకి వెళ్లాడు. ఇతనితో పాటు సమీపంలో మరికొంత మంది మహిళలు గేదెలను మేపుకుంటున్నారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో అతను స్పృహ తప్పి పడిపోయాడు. అతను పడిపోయిన స్థలం వద్ద పశువులన్నీ గుంపుగా ఉండటంతో గుర్తించిన సమీపంలోని మహిళలు అతని వద్దకు వెళ్లారు. వెంటనే ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఆదిలక్ష్మితో పాటు యుక్త వయస్సుకు వచ్చిన కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిడుగు పాటుకు సుబ్బరమణయ్య మృతి చెందటంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సిమెంటు రోడ్డుకు అడ్డంగా గోడ

- టీడీపీ నేతల దౌర్జన్యం
- నగరపాలక అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానికులు



జయమ్మ కాలనీలో సిమెంటు రోడ్డుకు అడ్డంగా టీడీపీ నేత నిర్మించిన గోడ

కడప కార్పొరేషన్ : కడప నగరంలో టీడీపీ నేతల అరాచకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. అధికారముంది కదా అని ఏమైనా చేయొచ్చు... ఏ స్థలమైనా కబ్జా చేసి స్వాధీనం చేసుకోవచ్చని భావిస్తున్నారు. చిన్నచౌకులోని మద్రాసు రోడ్డులో టయోటా షోరూం పక్కనున్న జయమ్మ కాలనీలో నిర్మించిన సిమెంటు రోడ్డుకు అడ్డంగా కమలాపురానికి చెందిన టీడీపీ నేత రాజగోపాల్‌రెడ్డి గోడ నిర్మించారు. రోడ్డు నిర్మించిన స్థలంలో 0.11 సెంట్లు తనదే అని చెబుతూ శనివారం ఉదయం సుమారు 100 మంది అనుచరులతో వెళ్లి దౌర్జన్యంగా సిమెంటు రోడ్డుకు అడ్డంగా గోడ కట్టించినట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి మేయర్‌గా ఉన్న సమయంలో 2007లో ఈ సిమెంటు రోడ్డును నిర్మించారు. అంటే సుమారు 18 ఏళ్లక్రితం నగరపాలక సంస్థ నిర్మించిన సీసీ రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడి ప్రజలు రాకపోకలు సాగించాలంటే ఇదొక్కటే రహదారిగా ఉంది. దీన్ని కూడా ఇప్పుడు గోడకట్టి మూసివేయడంతో తాము ఎలా రాకపోకలు సాగించాలని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై వారు నగరపాలక సంస్థ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

ఉత్సాహంగా క్యారమ్స్ పోటీలు



క్యారమ్స్ పోటీలలో తలపడిన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో శనివారం క్యారమ్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. బాలికల విభాగంలో ప్రశాంతి ప్రథమ, దేవిశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో అండర్ 11 పోటీలలో రెమంత్ ప్రథమ, అబ్దుల్‌ఖాదర్ ద్వితీయ స్థానంలో, అండర్ 14 విభాగంలో రంగనాథ్ ప్రథమ, ద్వారకనాథ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. పురుషుల విభాగంలో ఆబిద్ ప్రథమ, జశ్వంత్ ద్వితీయ స్థానంలో విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ కోచ్ శ్రీనివాసులు, హ్యాండబాల్ కోచ్ మునాఫ్, బాడ్మింటన్ కోచ్‌లు పాల్గొన్నారు.

డీఎస్సీకి 29915 దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్ : డీఎస్సీ -2025 పరీక్షకు వైఎస్సార్ జిల్లాలో 29915 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల్లో 6214 మంది పురుషులు ఉండగా 9598 మహిళలు ఉన్నారు. దరఖాస్తులకు సంబంధించి పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. జిల్లాలో అన్ని కేటగిరిల్లో కలిసి 705 పోస్టులు భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

కేటగిరిల వారీగా వివరాలు ఇలా...

డీఎస్సీ దరఖాస్తులకు సంబంధించి ఓసీ 2371 మంది, బీసీ–ఏ 1455 మంది, బీసీ–బి 2451 మంది, బీసీ–సీ 175 మంది, బీసీ–డి 1422 మంది, బీసీ–ఈ 1652 మంది, ఎస్సీ గ్రేడ్–1 ఒకరు, ఎస్సీ గ్రేడ్–2కు 2204 మంది, ఎస్సీ గ్రేడ్–3కి 3215 మంది ఎస్టీ విభాగంలో 866 మంది, ఈడబ్ల్యూఎస్ 1471 మంది దరఖాస్తు చేసుకున్నారు.

కడప నగరంలో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న కూటమి నేతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆపరేషన్ సింధూర్ ద్వారా పాకిస్తాన్‌కు గట్టిగా గుణపాఠం చెప్పిన భారత త్రివిధ దళాలు, ప్రధాని నరేంద్రమోదీకి సంఘీభావంగా శనివారం కడప నగరంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి పౌరుడు జాతీయ భద్రతకు అండగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ పార్లమెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, జనసేన జిల్లా కో ఆర్డినేటర్ సుంకర శ్రీనివాస్, కూటమి నేతలు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు అందుకున్న తహసీల్దార్

లింగాల : లింగాల మండల తహసీల్దార్‌గా 2022 నుంచి 2024 వరకు పనిచేసిన లక్ష్మీనారాయణ షోకాజ్ నోటీసులు అందుకున్నారు. 20 ఏళ్ల కాల పరిమితితో అసైన్డ్ భూములపై రైతులకు యాజమాన్య హక్కు కల్పిస్తూ చట్ట సవరణ చేసిన విషయం తెలిసిందే. అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయడంలో 2003 సంవత్సరానికి ముందు ఉన్న భూములను చేయాల్సి ఉంది. అయితే లక్ష్మీనారాయణ 2024–25 సంవత్సర భూములను కూడా ఫ్రీ హోల్డ్ చేశారని విచారణలో తేలింది. మండలంలోని లోపట్నూతల, లింగాల, కామసముద్రం గ్రామాల్లోని 76 ఎకరాల అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయడంపై జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ప్రస్తుత తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు.

సత్యదేవుని దర్శనానికి వచ్చి గుండెపోటుతో మృతి

అన్నవరం : కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో సత్యదేవుని దర్శనానికి వచ్చిన వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వెంకట రమణ అనే భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వెంకట రమణ స్వామివారి దర్శనం అనంతరం శుక్రవారం మధ్యాహ్నం దేవస్థానం ప్రాంగణంలో గుండెనొప్పితో పడిపోయాడు. దేవస్థానం ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం 108లో తుని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుని బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు రమణ మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు.

కియా కారెన్స్ క్లానిస్ కారు ఆవిష్కరణ



నూతన వాహనాన్ని ఆవిష్కరిస్తున్న జగన్నాథరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కియా సంస్థకు చెందిన కియా కారెన్స్ క్లానిస్ కారును కడప హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ షోరూం ఎండీ జగన్నాథరెడ్డి డైరెక్టర్లు చెరకు నిరంజన్, సి.భారతి, హోషిమారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కియా సంస్థ విడుదల చేసిన నూతన వాహనంలో అనేక ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. ప్రజలు తమ షోరూంను సందర్శించి వాహనాన్ని పరిశీలించడంతో పాటు బుక్ చేసుకోవచ్చన్నారు. వినియోగదారులు 9100773485 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో షోరూం ప్రతినిధులు, సిబ్బంది, కొనుగోలుదారులు పాల్గొన్నారు.

వైభవం.. రథోత్సవం

- నారాపుర వేంకటేశ్వర స్వామి వారి రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికిన ముస్లింలు



పాత బస్టాండ్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు



హిందువులకు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న ముస్లింలు

జమ్మలమడుగు : నారాపురస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. శనివారం ఉదయం ఆలయంలో భూదేవి, శ్రీదేవి సమేత నారాపుర వేంకటేశ్వర స్వామికి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు.

తరలి వచ్చిన భక్తులు..

స్వామి వారికి రథోత్సవాన్ని తిలకించేందుకు మండల పరిధిలోని ప్రజలే కాకుండా మైలవరం, పెద్దముడియం, కర్నూలు ప్రాంతాలనుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తులకు దాతలు మజ్జిగ ప్యాకెట్లు అందించారు. పట్టణంలోని దుకాణదారులు సైతం దుకాణాల ముందు వారికి తోచిన పానీయాలు పంపిణీ చేశారు.

వెల్లివిరిసిన మత సామరస్యం ..

పట్టణంలో వెంకటేశ్వర స్వామి రథోత్సవంలో భాగంగా ముస్లింలు పాత బస్టాండ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ ముల్లాజానీ ఆధ్వర్యంలో హిందువులకు గులాబీ పుష్పాలతో స్వాగతం పలికారు. అనంతరం అందరికీ పాయసం అందించారు. హిందు ముస్లిం భాయీ భాయీ అంటూ పరస్పరం ఆలింగనం చేసుకుని మత సామరస్యం చాటారు.

ఆక్రమణల పేరు చెప్పి అరాచకం

- వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో తాత్కాలిక నిర్మాణాల తొలగింపు
- ఎమ్మెల్యేకు, ఫిరాయింపు కార్పొరేటర్లకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు కక్ష సాధింపు



వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిర్మాణాలను జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్ : కడప శాసనసభ్యురాలు ఆర్. మాధవి ఆదేశాలతో కడప నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణల పేరుతో అరాచకం సృష్టిస్తున్నారు. తనకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వారి ఆస్తులను ధ్వంసం చేయడం లేదా వారి ఆర్థిక మూలాలను దెబ్బతీసే పనిలో ఎమ్మెల్యే, వారి అనుచరులు నిత్యం నిమగ్నమవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తొలినుంచి జయచంద్రారెడ్డి ఎమ్మెల్యే చేస్తున్న అరాచకాలపై గళం విప్పుతున్నారు. తాజాగా ఇటీవల వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఎమ్మెల్యేకు, వైఎస్సార్‌సీపీ నుంచి పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లకు వ్యతిరేకంగా ప్రెస్‌మీట్ పెట్టి విమర్శించారు. 24వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణ, 2వ డివిజన్ కార్పొరేటర్ సుబ్బారెడ్డిలపై ఆరోపణలు చేశారు. అలా మాట్లాడిన మరుసటి రోజే మద్రాసు రోడ్డులో నగరపాలక సంస్థకు చెందిన వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆక్రమణలున్నాయంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులను ఉసిగొల్పి కూల్చివేశారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండు గదులను జయచంద్రారెడ్డి లీజుకు తీసుకొని ఉండటం గమనార్హం. షాపింగ్ కాంప్లెక్స్ లీజుకు ఉన్నవారంతా వర్షపునీరు షాపు ముందు నిలబడకుండా, షాపులోకి వచ్చి వెళ్లేందుకు వీలుగా తాత్కాలికంగా రేకులు అమర్చుకొని, ముందువైపు తాపలు, ర్యాంపులు ఏర్పాటు చేసుకున్నారు. మున్సిపల్ ఉర్దూ బాలుర హైస్కూల్ ప్రహరీ, మున్సిపల్ స్టేడియం పక్కన నగరపాలక సంస్థ నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్లు వీటికంటే ముందుకు ఉన్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటి జోలికి వెళ్లకపోవడం గమనార్హం. తాత్కాలిక నిర్మాణాలన్నీ విద్యుత్ స్తంభాలకు లోపలే ఉన్నప్పటికీ కూల్చివేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలి

– జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్



పోలీసు సంక్షేమ హాస్పిటల్‌లో కంప్లీట్ బ్లడ్ కౌంట్ మిషన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని జిల్లా పోలీస్ సంక్షేమ ఆస్పత్రిలో రూ. 4.5 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక సెల్ కౌంట్ అనలైజర్ మిషన్ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్ మిషన్) ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మిషన్ పనితీరును యూనిట్ డాక్టర్ మేరీ సుజాతను అడిగి తెలుసుకున్నారు. ఖరీదైన రక్త పరీక్షలను పోలీస్ సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు అందుబాటులోకి తేవడం పట్ల పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్ హర్షం వ్యక్తం చేశారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని శనివారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పోలీస్ సంక్షేమ ఆస్పత్రి ఆవరణలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మొక్కను నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించడం సామాజిక బాధ్యతగా భావించి అందరూ సమష్టిగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) కె.ప్రకాష్ బాబు, ఆర్.ఐ లు టైటస్, వీరేష్, శ్రీశైల రెడ్డి, ఆర్.ఎస్.ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.